క్లుప్తంగా

ఉద్యోగ బాధ్యతల్లో బదిలీ సర్వసాధారణం


జడ్జి రాధా రాణికి వీడ్కోలు పలుకుతున్న మహిళా న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): ఉద్యోగ బాధ్యతల్లో బదిలీలు సర్వసాధారణమని మూడవ అదుపు జిల్లా జడ్జి అమ్మన్న రాజా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధా రాణి పేర్కొన్నారు. బుధవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో కొత్తగా వచ్చిన జడ్జికి స్వాగతం పలుకుతూ..ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారిని బార్ నాయకులు ఘనంగా సత్కరించారు. జడ్జీలు మాట్లాడుతూ బెంచ్‌కి బార్ సహకారం అవసరం అన్నారు. బార్ అధ్యక్షుడు హుసేన్ బాషా, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, కృష్ణా రెడ్డి, రామచంద్రారావు, రాజేశ్వరి, సౌజన్య, మద్దిలేటి రెడ్డి, చిన్న లింగమయ్య, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో చెట్ల చరిత్ర


మోడల్‌స్కూల్‌లో క్యూర్ కోడ్‌లను చెట్లకు అతికిస్తున్న విద్యార్థులు

ఉయ్యాలవాడ: క్యూఆర్ కోడ్ ద్వారా చెట్ల జీవిత చరిత్రను తెలుసుకోవచ్చని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మోడల్‌స్కూల్ ఆవరణలోని వివిధ రకాల చెట్లకు క్యూఆర్ కోడ్‌లను విద్యార్థులతో అంటించారు. మొబైల్‌లోని స్కానర్ ద్వారా క్యూఆర్ కోడ్ ఎలా స్కాన్ చేయాలి, యాప్‌ను ఎలా ఓపెన్ చేయాలి, అందులోని వివరాలను సమగ్రంగా తెలుసుకునేలా విద్యార్థులకు అధ్యాపకురాలు వైష్ణవి తెలియజేశారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా నేలతల్లిని కాపాడుకోవచ్చన్నారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ఆంధ్రా గ్రామీణ ఆణిముత్యం


గోవర్ధన్‌రెడ్డి

ఉయ్యాలవాడ: తెలంగాణ ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఆంధ్రా గ్రామీణ ప్రాంత విద్యార్థి సత్తా చాటాడు. మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన వంగాల లక్ష్మీనరసింహారెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమారుడు గోవర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ విద్యా సంస్థలో ఎంపీసీ చదువుతున్నాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించాడు. అత్యుత్తమ ఫలితాలు రావడంతో బంధువులు, గ్రామస్తులతో పాటు మాజీ గ్రామ సర్పంచ్ వంగాల సూర్యనారాయణరెడ్డి అభినందనలు తెలిపారు.

సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు జన నీరాజనం


మాట్లాడుతున్న సోమసుందర్

నంద్యాల(అర్బన్): సంక్రాంతి పండుగకు విడుదలై అశేష జనాదరణ పొందిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా వంద రోజులు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందని విక్టరీ వెంకటేష్ అభిమాన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సోమసుందర్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు శోభనాద్రి తెలిపారు. స్థానిక శ్రీరామ థియేటర్‌లో వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం అభిమానులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు చెందిన అభిమానులు నంద్యాలలో కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇంతటి ఘటన విజయాన్ని అందించిన వెంకటేష్ అభిమానులు, ప్రేక్షకులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.నాయకులు రాజశేఖర్, చౌదరి, రామకృష్ణ, రాంబాబు, రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

సౌభాగ్య పాడి నిషేధం

ఉయ్యాలవాడ: సౌభాగ్య పాడి(పేడ రంగు) నిషేధించినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సౌభాగ్య పాడి వాడడం ద్వారా ప్రజలకు హాని కలుగుతోందన్నారు. సౌభాగ్య పాడి విక్రయించే దుకాణాలపై 133 సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సాంకేతికతను వినియోగించుకోవాలి

మహానంది: రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటే ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతారని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. జయలక్ష్మి తెలిపారు. తమ్మడపల్లెలో బుధవారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. డాక్టర్ ఎల్. విజయభాస్కర్, డాక్టర త్రివిక్రమ్‌రెడ్డి, డాక్టర్ శివజ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాస రెడ్డి, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

ఫలితం 'పది'లం

ఆళ్లగడ్డ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పది పరీక్షల్లో సత్తాచాటారు. కార్పొరేట్ ఫలితాలను మించి సాధించారు. వందశాతం ఉత్తీర్ణతతో పాటు అత్యధిక మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించి సత్తాచాటారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించి పేద తల్లిదండ్రుల కళ్లల్లో సంతోషాన్ని నింపారు. ఆళ్లగడ్డ మండల పరిధిలోని 18 ప్రభుత్వ పాఠశాలల్లో 888 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 714 మంది ఉత్తీర్ణత సాధించారు. 80.41 శాతం ఉత్తీరణత సాధించారు.


సత్తాచాటిన ఆళ్లగడ్డ ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఆర్పీఆర్పీ బాలికల గురుకుల పాఠశాలలో వంద శాతం

పట్టణ శివారులోని ఆర్పీఆర్పీ ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. 79 మంది విద్యార్థులకు గానూ అందరూ పాసయ్యారు. ఇందులో కీర్తన 590, వర్షిత 585, ప్రియాంక 578 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో..

ఏపీ మోడల్ స్కూల్‌లో 76 మంది విద్యార్థులకు 69 మంది ఉత్తీర్ణత సాధించారు. సాయిలక్ష్మి 580, నందిని 574, షాహిదా 571 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజు తెలిపారు.

- పట్టణానికి చెందిన ప్రభుత్వ డాక్టర్లు నాగేశ్వర్‌రెడ్డి, రాజ్యలక్ష్మి దంపతుల కూతురు భవ్యదీప్షిక ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ 597 మార్కులు సాధించింది.


భవ్యదీప్షిక(597)

ఉత్తమ ఫలితాలు సాధించిన 'సర్కారు' విద్యార్థులు


పబ్బతి సాగర్ (587)


షేక్ సాలిహా (584)



వెంకటసుదాగాయత్రి(582) , శ్రావణి (570)

నంద్యాల(అర్బన్): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించి మన్ననలు పొందారు. చాబోలు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థి సాగర్ 587 మార్కులు సాధించాడు. అయ్యలూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థి షేక్ సాలిహా 584 మార్కులు పొందాడు. చాపిరేవుల జెడ్పీహెచ్‌ఎస్‌లో 62 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 48 మంది పాసయ్యారు. కొత్తపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో 71 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 48 మంది పాసయ్యారు. పోలూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 63 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 47 మంది, అయ్యలూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 40 మందికి గాను 36 మంది పాసయ్యారని ఎంఈఓ బ్రహ్మంనాయక్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు.

- గోస్పాడు: మండలంలోని 5 హైస్కూళ్లలో 199 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా వారిలో 180 మంది ఉత్తీర్ణతతో 90 శాతం, 196 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా వారిలో 157 మంది ఉత్తీర్ణతతో 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో 97మందికి 85మంది పాసై 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. దీబగుంట్ల హైస్కూల్‌లో 114 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 91మంది పాసై 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే యాళ్లూరు హైస్కూల్‌లో 79 మందికి 77మంది పాస్ అయి 97 శాతం, కేజీబీవీలో 38 మంది బాలికలు పరీక్షలు రాయగా 36 మంది పాస్ అయిన 94 శాతం, గోస్పాడు హైస్కూల్‌లో 67మందికి 48 మంది పాస్ 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థిని వెంకటసుధాగాయత్రి 582, శ్రావణి 570 మార్కులు , కేజీబీవీలో కార్తీక 571 మార్కులు సాధించారని ఎంఈఓ అబ్దుల్‌కరీం తెలిపారు.


విద్యార్థిని కావ్యను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, టీచర్లు

- శిరివెళ్ల: పదో తరగతిలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 97.43 శాతం, మోడల్ స్కూల్ 94.18 శాతం ఫలితాలు నమోదయ్యాయి.

మోడల్ స్కూల్ విద్యార్థిని గుమ్మ కావ్య 587 మార్కులు సాధించింది. జెడ్పీ ఉన్నత పాఠశాల 83.07, యర్రగుంట్ల జెడ్పీ పాఠశాల 64 శాతం, గోవిందపల్లె 82, రాజనగరం 75, మహదేవపురం 69.56, వీరారెడ్డిపల్లె 72.22 శాతం ఉత్తీర్ణత సాధించించాయి. రాజనగరం పాఠశాల విద్యార్థి సాయి ఈశ్వర్ 569 మార్కులు సాధించాడు.

- దొర్నిపాడు: పదో తరగతిలో డబ్ల్యూ కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల రెండోసారి వందశాతం ఫలితాలు నమోదు చేసింది. అలాగే అమ్మిరెడ్డి నగరంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. భాగ్యనగరం ఉన్నత పాఠశాలలో 43 మందికి గాను 42, దొర్నిపాడు ఉన్నత పాఠశాలలో 108 మందికి గాను 105 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ మనోహర్‌రెడ్డి తెలిపారు.


విద్యార్థులతో కలిసి విజయ కేతనం చూపుతున్న దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు


ఎల్లావత్తులలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం


రుద్రవరం కేజీబీవీలో విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్ఓ

- రుద్రవరం: మండలంలో 389 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 328 మంది పాస్ అయ్యారు. ఎల్లావత్తుల జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు సదా నాగేంద్ర 592, కమతం తులసీశ్వరుడు 585 మార్కులు సాధించారు. కేజీబీవీలో వంద శాతం ఉత్తీర్ణత నమోదు కాగా విద్యార్థిని ధరణి 575 మార్కులు సాధించింది. ఏపీ మోడల్ స్కూల్‌లో 82 మందికి 79, ఆలమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 60కి 47, ఎర్రగుడిదిన్నెలో 18కి 9 మంది, నర్సాపురంలో 33కు 28, పెద్దకంబలూరులో 27కు 21, రుద్రవరంలో 72కు 62, ఎల్లావత్తులలో 59కి 44 మంది చొప్పున ఉత్తీర్ణులయ్యారు.


సదానాగేంద్ర (592),


తులసీశ్వరుడు (585),


ఎల్.ధరణి (575)

- చాగలమర్రి: పదో తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.గాయిత్రి, మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్.షభానా 581 మార్కులు సాధించినట్లు ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని సమీర 568, కేజీబీవీ విద్యార్థినులు సింధూరి 565, మాండ్ల సునంద 564, పోతురాజు రమాదేవి 563 మార్కులు సాధించారన్నారు.


కె.సింధూరి (565)


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం


చాకలి మధుసూధన్(582)


నాగ నితీష్ రెడ్డి(570)


రోహిణి శ్వేత(552)

- ఉయ్యాలవాడ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉయ్యాలవాడ మండలంలో 85.09 శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్ విద్యార్థులు చాకలి మధుసూదన్ 582, నాగ నితీష్‌రెడ్డి 576, రోహిణి శ్వేత 556 మార్కులు సాధించినట్లు ఎంఈఓ -1 రఘురామిరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. హరివరం ఉన్నత పాఠశాలలో 51 మంది పరీక్షకు హాజరు కాగా 42 మంది ఉత్తీర్ణులయ్యారు. మాయలూరు ఉన్నత పాఠశాలలో 33 మందికి 27 మంది, బోడెమ్మనూరు ఉన్నత పాఠశాలలో 23 మందికి 22 మంది, కొండుపల్లెలో 27 మందికి 20 మంది, ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాలలో 27 మందికిగాను 20 మంది ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎంలు తెలిపారు. పుచ్చకాయలపల్లె కస్తూరిబా బాలికల కళాశాలలో 37 మంది బాలికలకు గాను 29 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఓ అంజనమ్మ తెలిపారు.

పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేయండి

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల: జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పాణ్యం, సంగమేశ్వరం, సంజామల, బోయవాండ్ల పల్లె గ్రామాల్లో గతంలో పర్యాటక అభివృద్ధి కోసం భూములను కేటాయించారని వాటిని మ్యుటేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆ భూములు దురాక్రమణలకు గురికాకుండా కంచె ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అహోబిలంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించి 2.5 ఎకరాల భూమి కేటాయిస్తే అందులో త్రీస్టార్ హోటల్ ఏర్పాటు చేస్తామన్నారు. బండిఆత్మకూరు మండలం పడమటూరు గ్రామంలో కేసీ కెనాల్‌కు పరీవాహక ప్రాంతానికి చెందిన 2 ఎకరాలు కూడా కేటాయిస్తే అందులో బోటింగ్, చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేస్తే టూరిజం అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. సున్నిపెంటలో 178 ఎకరాల రెవెన్యూ భూములను గుర్తించామని అందులో పర్యాటకానికి అవసరమైన 50 ఎకరాలు కేటాయించాలన్నారు. అహోబిలంలో స్వదేశీ దర్శన్ కార్యక్రమం ద్వారా ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ ఏర్పాటు చేస్తున్నామని అందులో పార్క్, రెస్టారెంట్, ఫిల్మ్ థియేటర్ వంటివి ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటక అధికారి సత్యనారాయణమూర్తి జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఏపీటీడీసీ డీవీఎం లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఎస్ఈ ఎస్.శివప్రసాద్ రెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి నాగమునేశ్వరీ, డీఎస్‌డీఓ రాజు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

విభిన్న ప్రతిభావంతులకు పతకాలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 21, 22, 23 తేదీల్లో ఏలూరు జిల్లా అగిరి మండలం తోటపల్లి గ్రామం హిల్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ భారత క్రీడా పోటీల్లో నంద్యాల విభిన్న ప్రతిభా వంతులు మేథోవైకల్యం కలిగిన పిల్లలు ఆరుగురికి రెండు గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్, రెండు బ్రాంచ్ మెడల్స్ సాధించినట్లు సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ప్రేమాంత కుమార్, జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ పోటీల్లో 26 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.నంద్యాల జిల్లాకు చెందిన కోచ్ నూర్‌బాషా ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, వెలుగోడు, నంద్యాల, పాణ్యం, బేతంచెర్ల మండలాల నుంచి ఎంపికైన ఆరుగురు పతకాలు సాధించినట్లు చెప్పారు.


మెడల్స్ సాధించిన విభిన్న ప్రతిభావంతులు

ఆధునిక వైద్య విధానంపై అవగాహన

గోస్పాడు: నేడు అత్యాధునిక వైద్య విధానం అందుబాటులో ఉందని వైద్యులు రాజేంద్రప్రసాద్, మణిదీప్ అన్నారు. భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో మైక్రో నాలెడ్జ్ అకాడమీ, మైక్రో ల్యాబ్స్ సహకారంతో మధుమణి నర్సింగ్ హోం సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు బుధవారం వైద్య సదస్సు నిర్వహించారు. ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్ రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో కర్నూలు పట్టణానికి చెందిన జీర్ణకోశ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ జీర్ణకోశ వ్యాధుల నిర్ధారణ, ఎండోస్కోపీ, అల్ట్రా సౌండ్ ప్రయోజనాలు అనే అంశంపై మాట్లాడుతూ ఎండోస్కోపీ అల్ట్రాసౌండ్ రోగులకు వరం లాంటిదన్నారు. చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ మణిదీప్ ముక్కు సైనస్ సమస్యలకు ఎండోస్కోపీ శస్త్ర చికిత్సలు అనే అంశంపై మాట్లాడారు. ముక్కు ఎండోస్కోపీ ద్వారా మెదడులో కొన్ని రకాల చికిత్సలు చేయడానికి కూడా అవకాశం ఉందన్నారు. ఐఎంఏ కార్యదర్శులు అనిల్ కుమార్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, సహదేవుడు, వసుధ రాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

రైలు కింద పడి యువకుడికి గాయాలు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదవశాత్తూ రైలుకింద పడటంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహమ్మద్ తెలిపిన వివరాలు.. కొలిమిగుండ్లకు చెందిన లోడ్ షిఫ్టింగ్ పనులు చేసే చౌడయ్య రైల్వేట్రాక్‌పై పడి ఉండటంతో స్టేషన్ మాస్టర్ గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని రెండు కాళ్లు విరిగిన చౌడయ్యను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి


సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిషోర్‌రెడ్డి, షేక్ బాబులాల్

ఆళ్లగడ్డ: వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే కుట్ర చేస్తోందని పలువురు ముస్లిం మత పెద్దలు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. వక్ఫ్‌బోర్డ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ జేఏసీ అధ్యక్షతన హిందూ లౌకిక వాదులు, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, కమ్యూనిస్ట్, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆళ్లగడ్డలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది లౌకిక వాదులు ర్యాలీలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టి రహదారిని దిగ్బంధించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రతి మతానికి సమానమైన హక్కులు, ప్రాతినిధ్యాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. దశాబ్దాలుగా ముస్లింల కోసం ఏర్పాటు చేసిన వక్ఫ్ బోర్డును రాజ్యాంగానికి వ్యతిరేకంగా సవరణ చేయడం రాజ్యాంగ విలువలను కాలరాయడమే అని ఆరోపించారు. కేంద్రం వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వక్ఫ్ సవరణ చట్టం.. రాజ్యాంగ విరుద్ధం

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమా కిషోర్‌రెడ్డి, షేక్ బాబులాల్‌లు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి సంఘీబావంగా ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట సవరణ ముస్లిం సమాజం, ముస్లిం పర్సనల్ లా బోర్డ్ పూర్తిగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26కు విరుద్ధంగా ఉందని, ఇస్లాం సంప్రదాయాలు, మతస్వేచ్ఛ, సాంస్కృతిక హక్కులు, మత సామరస్యం, సామాజిక ఐక్యతను ప్రభావితం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు .. ఈ సరవణ చట్టానికి వత్తాసు పలకడం ముస్లిం సమాజాన్ని వంచించడమే అన్నారు. 400 ఏళ్ల నాటి స్థలాలకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఏలా వస్తాయని ప్రశ్నించారు. దీని వల్ల పురాతన మసీదులు, దర్గాలు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని రద్దుచేసే వరకు పోరాడతామన్నారు.

ఉగ్రవాదం, మతోన్మాదం దేశానికి ప్రమాదకరం

- పహల్గాం ఉగ్రవాద చర్యను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ కొవ్వొత్తుల ర్యాలీ

నంద్యాల(అర్బన్): ఉగ్రవాదం, మతోన్మాదం దేశానికి ప్రమాదకరమని, దేశ ఐక్యతను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్ తెలిపారు. పహల్గాం ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా బుధవారం రాత్రి పట్టణంలోని గాంధీచౌక్ నుంచి శ్రీనివాససెంటర్ వరకు పార్టీ నాయకులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కౌన్సిలర్లు అబ్దుల్ కలాం, అబ్దుల్‌మజీద్, కృష్ణమోహన్, చంద్రశేఖర్, సోమశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, అనిల్‌అమృతరాజ్, దేవనగర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శశికళారెడ్డి, రసూల్ ఆజాద్, శివయ్య, సాయిరాంరెడ్డి, కారురవికుమార్, ముస్లిం జేఏసీ నాయకులు గన్నీకరీం, సోహేల్‌రాణా, మహబూబ్‌బాషా, మునెయ్య, దండె సుధాకర్, కాల్వ నాగరాజు, అంజి, రహంతుల్లా, మనోజ్, కిరణ్, పైలెట్ పాల్గొన్నారు.


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): పహల్గాంలో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళేశ్వర్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, పోలేపల్లి సందీప్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్‌లో పర్యాటకులపై తీవ్రవాదులు దాడి చేసే క్రమంలో మతం చూసి కాల్చి చంపడం దుర్మార్గమన్నారు. జిల్లా కార్యదర్శి కిశోర్, సహ కార్యదర్శి నాగరాజు, ఆర్ఎస్ఎస్ నాయకుడు చిలుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విశ్వాహిందూ పరిషత్ నాయకులు

ఉగ్రదాడి హేయమైన చర్య

నంద్యాల(అర్బన్)/(న్యూటౌన్): పహల్గామ్ ఉగ్రదాడి హేయమైన చర్య అని ఆల్ మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీమ్ అన్నారు. అమాయక పర్యాటకులను బలిగొన్న ఉగ్రమూకల చర్య మానతవ్వానికి మచ్చగా నిలిచిందన్నారు. స్థానిక కార్యాలయంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల ప్రజా సంఘాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు.పాస్టర్ బెన్‌హిన్, చిరువ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, శివరామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, చాబోలు ఆరీఫ్, నబిరసూల్, మౌలాలి పాల్గొన్నారు. అలాగే ఉగ్రవాదుల దాడి దుర్మార్గమని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. ఉగ్రమూకలపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న ఆల్‌మదద్ ఫౌండేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నంద్యాల ముస్లిం జేఏసీ తీవ్రంగా ఖండించింది. దుర్మార్గపు చర్యగా అభివర్ణించింది. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. స్థానిక క్రాంతి రేఖ గ్రంథాలయంలో బుధవారం జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షులు అబ్దుల్ సమ్మద్, అబులైస్, కో కన్వీనర్ సద్దాం పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఉగ్రవాద చర్య తీవ్రంగా కలిచి వేసిందన్నారు. షేక్షావలి, మహబూబ్ బాషా, హుసేన్, అయూబ్ పాల్గొన్నారు.